పారిశుధ్యంపై దృష్టి సారించాలి

వాంకిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా వెదురు మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు జాబ్ కార్డులు అందించాలని ఎంపీడీవో సూచించారు. పారిశుధ్యంతో పాటు ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ పథకాలపై సమీక్షించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీవో శ్రావణ్, ఈసీ మొసిన్, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

జైనూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆడె ప్రకాష్ అన్నారు. ఆయన సంఘ నాయకులతో కలిసి బుధవారం మండలంలో సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆత్రం దత్తు, రాథోడ్ రవిందర్, భుమన్న, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం
- అందుబాటులోకి ఎన్నికల సామగ్రి
- పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తి
- ఎన్నికల కమిషన్‌కు నివేదిక



'పరిషత్'కు సన్నద్ధం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. నోటిఫికేషన్ ఈనెల 10 తర్వాత ఏ క్షణమైన వచ్చే అవకాశాలు న్నాయన్న సంకేతంతో అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లు, నామినేషన్ పత్రాలు, అధికారులు, సిబ్బంది నియామకంతో పాటు కౌంటింగ్‌కు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో 127 ఎంపీటీసీ, 15 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి రెండు దశల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తొలి విడ తలో ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్ (యూ), లింగాపూర్ జడ్పీటీసీ స్థానాలు. వీటి పరిధి లోని 66 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రెండో విడతలో కాగజ్‌నగర్ డివిజన్ లోని కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట, దహెగాం, బెజ్జూరు జడ్పీటీసీ స్థానాలు, వీటి పరిధిలోని 61 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదించారు. అలాగే ఓట్ల లెక్కింపును సైతం రెండు చోట్ల నిర్వహించనున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

● పోలింగ్ కేంద్రం..

పోలింగ్ కేంద్రం 600 ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ప్రతి జడ్పీటీసీ స్థానానికి ఒక రిటర్నింగ్ అధికారి, ఎంపీటీసీ స్థానానికి రిటర్నింగ్ అధికారి, ఏఆర్వో ఉంటారు. అదే విధంగా 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లుండే కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు నియమించనున్నారు. 401 నుంచి 600 ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. ఈ కేంద్రాలలో 4,706 మంది అవసరమున్నట్లు జాబితాను సిద్ధం చేశారు. కాగా జిల్లాలో 3,54,691 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,77,105, మహిళలు 1,77,567 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. వీరి కోసం 693 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 1,260 బ్యాలేట్ బాక్సులను సిద్ధం చేశారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం..

- భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేం దుకు సిద్ధంగా ఉన్నాం. ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యా యి. మండలాలకు ఎన్నికల సామగ్రిని చేరవేశాం. ఓట రు జాబితాలను సిద్ధం చేస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల కమి షన్‌కు నివేదిక కూడా పంపించాం.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బెజ్జూరులో మాట్లాడుతున్న ఎస్సై సర్తాజ్‌పాషా

బెజ్జూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బెజ్జూరు ఎస్సై సర్తాజ్‌పాషా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్‌కు అనవసరమైన వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. అలాగే ఏపీకే యాప్‌ల ద్వారా వచ్చే సందేశాలను నమ్మవద్దని చెప్పారు. కొన్నిసార్లు డిజిటల్ అరెస్టు చేస్తున్నామని నేరగాల్లు ఫోన్ చేస్తే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అప్రమత్తంగా లేకపోతే ఖాతాలోని సొమ్ము పోగొట్టుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అనుమానం వచ్చినప్పుడు 1930నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గంగన్న అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు వచ్చే తెలియన లింక్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రతేకాధికారి ప్రసన్న భారతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

లింగాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఎంపీయూపీఎస్, ఘూమ్‌నూర్ కే ఎంపీపీఎస్ పాఠశాలలను బుధవారం ఎంఈవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ యస్‌తో పాటు ఎఫ్ఎల్ఎన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని చెప్పారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని తెలిపారు. ఎంఈవో వెంట సీఆర్పీ సంజీవ్, ఉపాధ్యాయులు హేమబిందు, నాగమణి ఉన్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేసేందుకు కమిటీ సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొసైటీ సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ప్రతీ సభ్యుడు వంద మంది సభ్యులను చేర్పించి సొసైటీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో పదిమంది సభ్యులతో జిల్లా మేనేజింగ్ కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. అన్ని రంగాల వారిని సభ్యులుగా నమోదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు సభ్యులతో అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, పర్యవేక్షకులు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధ్రువపత్రాలను పారదర్శకంగా పరిశీలించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని అంకుశాపూర్ గ్రామంలో బుధవారం గల ప్రభుత్వ వైద్య కళాశాలలో అధికారులతో కలిసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఈ క్రమంలో పోస్టుల భర్తీ కోసం అభ్యర్థుల ధ్రువపత్రాలను పారదర్శకంగా పరిశీలించి నిష్టాతులైన వారిని ఎంపిక చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకుడు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

లింగాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా హనవతే సూర్యాకాంత్ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు ఇక్కడ ఏపీఎంగా పని చేసిన తిరుపతి మం చిర్యాల జిల్లా కన్నెపల్లికు బదలిపై వెళ్లా రు. సూర్యాకాంత్ ఉట్నూర్ మండలం నుంచి బదలిపై వచ్చారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి

సిర్పూర్(టి) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇచ్చిన అవార్డు విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ సూపరింటెండెంట్‌కు బుధవారం పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. సిర్పూర్(టి) రేంజి పరిధిలోని నవేగాంకు చెందిన ఎల్కులె కిషోర్ అనే వ్యక్తికి ఈనెల 3న అటవీ శాఖాధికారులు వన్యప్రాణుల సంరక్షణ, అడవుల పరిరక్షణకు కృషి చేసినట్లు ఆయనకు ఇచ్చిన అవార్డు, నగదు పురస్కారంపై విచారణ చేపట్టాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎంపిటిసి దుర్గం విక్రమ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖీజర్ హుస్సేన్, నాయకులు ఇఫ్సత్ హుస్సేన్ తదితరులు అటవీ శాఖ సూపరింటెండెంట్ అంకుశావలీకి ఈవిషయమై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని సూపరింటెండెంట్ చెప్పారని తెలిపారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కర్ణగౌడ్ అన్నారు. సంఘ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలను వెంటనే చెల్లించాలని క్యాష్‌లేస్ హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి చికిత్సలు అందేలా చుడాలని వైద్యులను మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఆగస్టు 15లోగా పరి ష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, కిష్టయ్య, శ్రీరాములు, రామస్వామి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, లింగయ్య, సూరు, కనకమ్మ, అమలమేరి, సత్తమ్మ పాల్గొన్నారు.

జయశంకర్‌కు ఘన నివాళి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో కొత్తపల్లి జయశంకర్ చిత్రపటాలకు అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో తెలంగాణ సాధనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సహాయ కర్తగా విశేష సేవలందించారని తెలంగాణ భావజాల వ్యాప్తికి తన జీవితాన్ని దారపోసిన మహనీయుడన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో జయశంకర్ జయంతిని జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాంనాయక్ తన కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సైతం జయశంకర్ జయంతిని జరుపుకున్నారు. విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్, బీసీ సంక్షేమాధికారి సజీవన్, డీటీవో రాంచందర్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయం, ఎంపీడీవో తహసీల్, తదితర కార్యా లయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ కవిత, డీటీ రాంలాల్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, శాఖ గ్రంథాల య ఇన్‌చార్జి అశోక్, మాజీ సర్పంచు బండె తుకారాం, బీఆర్ఎస్ నాయకులు రాకేష్, అశుతోష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ అడుగుజాడల్లో నడవాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బీమ్లానాయక్, జూనియర్ అసిస్టెంట్లు సాయి, ప్రకాష్, జావీద్, గిరిజన నాయకుడు తిరుపతి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిర్పూర్ (టి) (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ మహ్మద్ రహీముద్దీన్, ఎంపీడీవో సత్యనారాయణ, గ్రామ పంచాయతీ ఈవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాగజ్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవో 49 విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ నాయకులు బురదజల్లేలా చేసే వ్యాఖ్యలు సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నివాసంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై నివేదికలు వచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఎంపీ గెడెం నగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా జీవో 49 తాత్కాలిక రద్దు అంశం కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదమేనన్నారు. ఈ జీవో తెచ్చింది, రద్దు చేసింది కూడా కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. కేవలం కేంద్రంపై బురద జల్లే చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీన్ని రాజకీయ చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకునే ప్రక్రియకు పూనుకున్నారని అన్నారు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. రైతుల లబ్ధిచేకూరస్తామన్న పథకాలు ఇంత వరకు అమలు కావటం లేదన్నారు. జీవో 49 పూర్తిగా రద్దు చేయాలన్నారు. అంత వరకు అన్నీ సంఘాలతో కలిసి పోరాటం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ వెంకటేష్ నేత, జిల్లా అధ్యక్షులు దోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సిందం శ్రీనివాస్, వీరభద్రచారితో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలిసారిగా రాష్ట్ర అధ్యక్షుడు కాగజ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పాల్వాయి హరీష్‌బాబు నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన అల్పాహారం చేశారు.

సమయపాలన పాటించాలి

సిర్పూర్(యు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రత్యేక కృషి చేయాలని మహాగాం స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి అన్నారు. మహాగాం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మందిరంలో బుధవారం కాంప్లెక్స్ పరిదిధిలోని ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ పిల్లలు క్రమం తప్పకుండా బడికి హాజరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వాహించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఆర్పీ మండాడీ గఁగ్రూ, గేడం జగ్జీవన్, కోట్నాక పాండురంగ్, కుమ్ర భీంరావు, తార పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



వాంకిడిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత

వాంకిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలతోనే పుట్టిన బిడ్డకు ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. మండలంలోని బంబర గ్రామలో బుధవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మొదటి ఆరు నెలలు తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమైదని అన్నారు. రొమ్ము లోపల యాంటీబాడీస్, విటమిన్లు, ప్రోటీన్లు ఉంటాయన్నారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడంవల్ల శిశువులో మెదడు పెరుగుదలకు సహకరిస్తుందని, రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుందని తెలిపారు కార్యక్రమంలో పోషన్‌అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, సరిత, ఏఎన్ఎం సునంద, ఆశా వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): తల్లిపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని పంచాయతీ కార్యదర్శి హరీష్ అన్నారు. మండలంలోని గుండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు వచ్చే ముర్రుపాలను పిల్లలకు పట్టించాలన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి సక్రమంగా టీకాలు వేయిస్తూ వారి ఆరోగ్యానికి భద్రత కల్పించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణుల కు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో హెచెం కవిత, అంగన్ వాడీ టీచర్లు పద్మ, పెంటుబాయి, విజయలక్ష్మి, ఏఎన్ఎం సంగీత, ఆశ వర్కర్ దేవి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు తల్లి పాలు ఎంతో ముఖ్యమని జైనూర్ సీడీపీవో ఇందీర అన్నారు. మండలంలోని గూడామామడాలో ఏర్పాటు చేసిన తల్లి పాల వారోత్స వాల్లో ఆమె మాట్లాడారు. చిన్నారులకు తల్లి పాలు పట్టడం వల్ల సరైన పౌష్టికాహారం అందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు తప్పక పౌష్టికాహారం అందించాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్త హీనత ఏర్పడదని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సేవంత, ఆశా వర్కర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ ఉద్యోగుల హక్కు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

బెజ్జూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమోషన్ అనేది ఉద్యోగుల హక్కు అని ఆదివాసీ టీచర్ అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని కుంటలమానేపల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఆ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ప్రమోషన్‌తో ఉద్యోగులకు బాధ్యత మరింత పెరుగుతుందని చెప్పారు. ఉపాధ్యాయులంతా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, జిల్లా నాయకులు సాయినాథ్, నారాయణ, అశోక్, ఆనంద్, రావూజి, పదాశివ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సీఐకి సన్మానం

ఆసిఫాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ బాలాజీ వరప్రసాద్‌ను బుధవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, నాయకులు గోపాల్, శ్రీనివాస్, సత్యనారయణ, గంగన్న, తిరుపతమ్మ, నవీన్ పాల్గొన్నారు.

పొలం పని చేస్తుండగా పిడుగు పాటు

అస్వస్థతతో ఒకరి మృతి


శంకర్(ఫైల్)

కౌటాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పొలం పని చేస్తుండగా పిడుగు పడడంతో తీవ్ర అస్వస్థతతకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. కౌటాల మండలం పార్డి గ్రామానికి చెందిన షెడ్మెక శంకర్(55) అనే వ్యక్తి బుధవారం పిడుగు పాటుతో మృతి చెందాడు. షెడ్మెక శంకర్ కూలీలతో కలిసి తన పొలంలో నాటు వేయిస్తున్నాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం పడింది. ఆ సమయంలో పొలంలో శంకర్‌కు సమీపంలో పిడుగు పడింది. దాని ప్రభావానికి శంకర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. శంకర్ కుటుంబసభ్యులు వెంటనే ఎడ్లబండిపై ఇంటికి తరలిస్తుండగా మృతి చెందాడు. శంకర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. పోస్టుమార్టం కోసం అంబులెన్స్‌లో సిర్పూరు(టి) ఆసుపత్రికి తరలించారు. తక్షణ ఆర్థిక సహాయంగా రూ. ఐదు వేలను అందజేశారు. కోనప్ప వెంట డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య, నాయకులు వసంత్, శ్రీనివాస్, డబ్బా బాపు, సంతోష్ ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో చెన్నూరు మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన కాటేల కృష్ణస్వామి అనే నిందితుడికి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 17-7-2019లో పదో తరగతి చదువుతున్న బాలికను కృష్ణస్వామి బెదిరించి తన స్కూటీపై ఎక్కించుకుని వెళ్లాడని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు కేసు నమోదు విచారణ చేపట్టారు. పీపీ రాంబాబు సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. జడ్జి విచారణ చేసి నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, 1,500 రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

రామకృష్ణాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌కు చెందిన సంతోష్‌పై కత్తి, కర్రలతో దాడి చేసిన కేసులో పరారీలో ఉన్న బొల్లం అంజి అలియాస్ ఆంజనేయులు అనే నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం రామకృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. గత నెలలో సంతోష్ అనే వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు కాగా ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి బొల్లం అంజి పరారీలో ఉండగా బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చిన్నారుల అసభ్యకర వీడియోలను షేర్‌చేసిన వ్యక్తి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ అశోక్, పాల్గొన్న ఎస్సై ఉపేందర్‌రావు

నస్పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను అసభ్యకరమైన వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లోకి షేర్ చేసిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తెలిపారు. నస్పూర్ పట్టణంలోని తాళ్లపల్లి పునరావాస కాలనీకి చెందిన కర్రు సందీప్ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసినట్లు తెలిపారు. బుధవారం సైబర్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ ఎక్స్‌ప్లో యిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఇ) గుర్తించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం సమాచారం ఇచ్చిందన్నారు. తమకు అందిన సమాచారంతో సందీప్‌ను అన్ని ఆధారాలతో పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ఇంటర్నెట్‌లో చిన్నారుల అసభ్యకరమైన వీడియోల గురించి వెతికినా, సోషల్ మీడియా వాట్సఅప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రాం, ఇతర సామాజిక మాధ్యామాలలో షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై ఉపేందర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. .

అరకొర వసతులు

- గ్రంథాలయాలకు పక్కా భవనాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న యువత
- పట్టించుకోని అధికారులు



కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రంథాలయాల్లో సౌకర్యాల లేమితో నిరుద్యోగ యువత అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలతో పాటు కాగజ్ నగర్ లాంటి పట్టణంలోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు పోటీ పడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని కేవలం జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో నూతన భవనం పూర్తయి అన్ని సౌకర్యాలతో ఉంది. మిగిలిన చోట్లయిన కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), కౌటాల, బెజ్జూరు, కెరమెరి, వాంకిడి, జైనూరు, రెబ్బెన తదితర మండల కేంద్రాల్లో నేటికి కూడా లైబ్రరీలకు పక్కా భవనాలు లేవు. కొన్ని చోట్ల ఇంకా కేంద్రాలు శిథిలా వస్థకు చేరుకున్నాయి.

నూతన మండలాల్లో రీడింగ్ రూంలు ఏర్పాటు చేస్తామని చెప్పినా వాటి గత ప్రభుత్వంలో ఊసే లేదు. కాగజ్‌నగర్ లైబ్రరీలో సుమారు 2000 మంది సభ్యత్వం కలిగి ఉన్నప్పటికీ కేవలం ఎస్పీఎం మిల్లుకు చెందిన ఒక ఇరుకైన గదిలో గత 40 ఏండ్లుగా కొనసాగుతోంది. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో రీడర్స్ సతమతమవుతున్నారు. పక్కా భవనం కోసం స్థలం లేక పోవడంతో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఈ కేంద్రం లోనూ ఫర్నిచర్, తదితర సౌకర్యాలు లేవు. కాంపీటేటివ్ పుస్తకాలు తదితర మెటీరియల్ ఉన్నప్పటికీ సదుపాయాలు కల్పించడం లేదు.

మూడు నెలల క్రితం..

రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మే 6న పలు గ్రంథాలయాలను సందర్శించారు. ఇందులో భాగంగా కాగజ్‌గనర్, సిర్పూర్ (టి), కౌటాల గ్రంథాలయాల పరిస్థితి చూసి సదుపాయాలు కల్పించేందుకు హామీ ఇచ్చారు. కౌటాల మండలం కేంద్రంలో కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఐకేపి కేంద్రంలో కొనసాగిస్తున్నారు. సిర్పూర్ (టి)లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో ఆర్ అండ్‌బి శాఖ పరిధిలోని ఒక గదిలోకి మార్పు చేసేందుకు సన్నాహాలు చేసినా ఫలితం లేదు. పరిశీలించి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు. మౌలిక వసతులు కల్పనకు ఏళ్ల తరబడి వేచి చూస్తున్నా సమస్య పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు చొరవ చూపడం లేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. గ్రంథాలయాల్లో ఫర్నీచర్, మంచినీటి వసతి, ఫ్యాన్లు, మరుగు దొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. లైబ్రరీల వేళల్లో మార్పులు చేసినప్పటికీ పక్కా భవనాలు లేకపోవడంతో నిరుత్సాహం చెందుతున్నారు. నిరుద్యోగ యువత లైబ్రరీలోనే చదువుకునేందుకు గతంలో ఉన్న సమయాలను మార్పు చేశారు.

ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం ఐదు వరకు లైబ్రరీలను భోజన విరామ సమయం మినహా తెరిచే ఉంచాలని ఆదేశాలు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగాల కోసం యువకుల కల సాకారం చేసుకునేందుకు నిరుద్యోగులకు వరుస నోటిఫికేషన్స్ ప్రకటిస్తున్నప్పటికీ పేద, మధ్య తరగతి వర్గాల వారికి అందుబాటులో ఉండాల్సిన గ్రంథాలయాల్లో సౌకర్యాలు కరువయ్యాయని చెబుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువత కోరుతున్నారు.

మహిళల భద్రతపై అవగాహన

రెబ్బెన, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి హైస్కూల్‌లో బుధవారం మహిళల భద్రతపై షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ ఇన్‌చార్జి, ఎస్సై తిరుమల విద్యార్థినులు భద్రత చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలనే అంశాలపై వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో అంతా జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈవ్‌టీజింగ్ తదితర సమస్యలుంటే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఏఎన్ఎం విజయ, అడ్వకేట్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాంనాయక్ అన్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకు పోయిన మాలన్‌గోంది వంతెనను పంచాయతీరాజ్ ఈఈ కృష్ణతో కలిసి బుధవారం పరిశీలించారు. వంతెన నిర్మాణం కోసం వెంటనే నివేదికలు తయారు చేసి నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిజాం, జక్కయ్య, మురళీ, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

తనిఖీ చేసి..పాఠాలు బోధించి..


విద్యార్థినులకు పాఠం చెబుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని ఖిరిడి ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నభోజనం నాణ్యత, వంటశాల, తరగతి గదులు, రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి ప్రశ్నలు సంధించి పఠన సామార్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్నభోజనం, తదితర వసతులు కల్పిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. కట్టెల పొయ్యి కాకుండా గ్యాస్ పొయ్యిపై వంటలు చేయాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయాలు, వినియోగించాలని తెలిపారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా ప్రతి రోజు పర్యవేక్షించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి సబ్జెక్టులలో వెనుకబడిన వారిని గుర్తించి వార్షిక పరీక్షలకు ఇప్పటి నుండే సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణ కమిటీ ఎన్నిక

జైనూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణ కమిటీని ఎన్నుకునట్లు ఆదివాసీ జేఏసీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గౌరవఅధ్యక్షులుగా మడావి మనోహర్, కొడప హన్ను పటేల్, అధ్యక్షునిగా మడావి మధురాజ్, ఆత్రం ఆనంద్‌రావ్, ఉపాధ్యక్షులుగా ఆత్రం రాను పటేల్, ఆత్రం గోవింద్‌రావ్, గేడాం మారుతి, పెందర్ ప్రకాష్, కార్యదర్శులుగా గేడాం గణపత్‌రావ్, కొడప వామన్‌రావ్ ఎన్నికయ్యారని చెప్పారు. ప్రచార కార్యదర్శులుగా మడావి ఇస్తు, తోడ్సం రాజేందర్, జుగునాక ధర్మేందర్, మేస్రాం నాగేష్, కార్యదర్శులుగా ఆడ శేషనారాయణ, సలాం వెంకట్‌రావ్, తుమ్రం కోటేష్, గేడాం లక్ష్మణ్, కనక యాదవ్‌రావ్, కుంరశాంరావ్, ఆత్రం శంకర్‌లను ఎన్నుకున్నట్లు యాదవ్‌రావ్ తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

జైనూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడామామడాలో బుధవారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ అసిస్టెంట్ పెందుర్ భారత్, ఎఎన్ఎం సేవంత, ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఆసిఫాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి బుధవారం ఆయన రావడంతో బీజేపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్, కుమరంభీం విగ్రహలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పాలకు 60 ఏళ్లలో చేయని అభివృద్ధిని పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిందన్నాఉ. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టి భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపారన్నారు. 11ఏళ్ల మోదీ పాలనలో తెలంగాణకు 12 జాతీయ రహదారులు మంజూరయ్యాయని చెప్పారు. దీంతో ప్రజలకు ఎంతో సౌకర్యం కలిగిందన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి ఇప్పటి వరకు రూ. 12 లక్షల కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం తామే అన్ని ఇస్తున్నామని చెప్పుకుంటుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించకుండా ఇక్కడి ప్రాంత సాగు భూములకు అన్యాయం చేశారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలలోని 2.50 లక్షల ఎకరాలు సాగునీరందే అవకాశం ఉండేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం కోసం డీపీఆర్ ఇస్తే కేంద్రంతో మాట్లాడతామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపి నగేష్ మాట్లాడుతూ జీవో 49తో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కన్జర్వేషన్ ఫారెస్టుకు బీజం పడిందన్నారు. జీవో తీసుకు వచ్చింది, నిలుపుదల చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ జీవో 49 రద్దయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, వన్‌నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, కొట్నాక విజయ్, చెర్ల మురళీ, గోమాస శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, మల్లిఖార్జున్ యాదవ్, ఏమాజీ, అంజనేయులుగౌడ్, సొల్లు లక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): రానున్న సంస్థల ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీ వైపే ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో శివ ఆంజనేయ పంచముఖి ఆలయంలో పూజలు నిర్వహించి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర పదవి స్వీకరించిన తరువాత బెల్లంపల్లి పట్టణానికి రావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందూ కలిసికట్టుగా బీజేపీ గెలుపుకోసం కృషి చేయాలని పలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, శ్రీనివాస్, హేమాజీ, తిరుపతి, కాసర్ల సంతోష్, కళ్యాణి పాల్గొన్నారు.

ఆర్థిక ప్రయోజనాలు పొందాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సింగరేణి ఉద్యోగులు ఆర్థిక ప్రయోజనాలు పొందాలని అధికారులు సూచించారు. సింగరేణి అధికారులు, ఏఐటీయూసీ నాయకులు, బ్యాంక్ అధికారులు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ డిప్యూటీ జీఎం, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ అయిన సుజిత్ కుమార్ ఝూ వివరాలు తెలియజేశారు. కార్పొరేట్ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి రూపాయలు ప్రమాదబీమా కుటుంబానికి అందిస్తామన్నారు. పాక్షికంగా వైకల్యం పొందితే 62.5 లక్షల రూపాయలు, టర్మ్ ఇన్సూరెన్స్ లో భాగంగా పది లక్షల రూపాయలు, తక్షణ వైద్య ఖర్చులకు 60 వేల రూపాయలు అందిస్తామని, ఉచిత లాకర్ సౌకర్యం, ప్రాసెసింగ్ ఫీజు లేకండా ఇంటి, వాహన, పర్సనల్ రుణాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య మాట్లాడుతూ సహజ మరణం పొందిన కార్మికులకు కూడా కనీసం 20 లక్షల రూపాయల వరకు బీమా ఇవ్వాలని కోరారు.

ఉద్యోగులకు అభినందన

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత నెలలో 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు ఎస్‌ఆర్‌పీ 1 గని ఉద్యోగులను ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ బుధవారం గని ఆవరణలో అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, గ్రూప్ మేనేజర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు చిరస్మరణీయం


జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయమని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా జీఎం కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ జయశంకర్ హనుమకొండ జిల్లాలో జన్మించి రాష్ట్ర ఆవిర్భావానికి ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆయన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం, నాన్ ముల్కీ ఉద్యమం, ఇండ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, డీజీఎం (ఏరియా స్టోర్స్) మల్లయ్య, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, ఫైనాన్స్ మేనేజర్ నరేష్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో జయశంకర్ జయంతిని నిర్వహించగా బీఆర్ఎస్ నస్పూర్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వంగ తిరుపతి, షైమద్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, నాయకులు ఎండీ లాల, వెంగళ కుమారస్వామి, సాదుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయ శంకర్ సేవలు చిరస్మరణీయమని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎంవిజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఎస్‌శైలజ, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహెర తదితరులు పాల్గొన్నారు. గోలేటిలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి ప్రకాష్‌రావు, నల్లగొండ సదాశివ్, వీరస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన లాభాల వాటా ఇప్పిస్తాం

మందమర్రిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెరుగైన లాభాల వాటా ఇప్పించేందుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గత కార్మిక గుర్తింపు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిగెలిచిన ఏఐటీయూసీ హామీల అమలును ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు. సింగరేణిలో 2003లో తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడే కార్మికుల హక్కులకు పెద్దపీట వేశామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగులు సొంతింటి కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, అయినప్పటికీ ఈ పథకం అమలు కావడం లేదన్నారు, ఏఐటీయూసీ నాయకులు సొంతింటి పథకం నెరువేరుస్తామని చెప్పి ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఈ పథకం కోసం తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ముఖ్యమంత్రికి వివరించారన్నారు. ప్రతి నెల ఇన్‌కంటాక్స్ రూపేణా రూ. 50 వేల నుంచి లక్ష వరకు రికవరీ అవుతున్నాయని ఇన్‌కంటాక్స్‌ను యాజమాన్యమే చెల్లించాలన్నారు. జనక్ ప్రసాద్ మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రికి ప్రధాన డిమాండ్లను కలిసి వివరించనున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్,వెంకటస్వామి, భిక్షపతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావొద్దు

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావద్దని శ్రీరాంపూర్ గ్రూప్ ఏజెంట్ జి రవి కుమార్ సూచించారు. ఎస్‌ఆర్‌పీ 3 గనిలో గైర్హాజరీ ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు 30 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్‌లో గని మేనేజర్ వెంకట్ రావు, సంక్షేమాధికారి వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ టి. క్రాంతికుమార్, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి యాజమాన్యం రికవరీ చేసిన అండర్‌గ్రౌండ్ అలవెన్సుల డబ్బులు తిరిగి ఇవ్వాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. నస్పూర్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందారం 1ఏ గనిలో పనిచేసే కార్మికులను 2023 సంవత్సరంలో ఓసీపీలో పని చేయించుకున్న యాజమాన్యం వారికి ఇవ్వాల్సిన అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కట్ చేయడం సరికాదన్నారు. అప్పటి అవెన్సులను జూలై వేతనంలో మినహాయించుకోవడం దారుణమని తెలిపారు. సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి నేవల బాలయ్య, ఎన్‌టీపీసీ నాయకులు ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ నిబంధనలు పాటించాలి


ఓసీపీలో వివరాలు తెలుసుకుంటున్న డీడీఎంఎస్ రాజవ్‌వర్మ

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు రక్షణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీడీఎంఎస్(ఎలక్ట్రికల్) రాజీవ్‌వర్మ అన్నారు. ఇందారం, శ్రీరాంపూర్ ఉపరితల గనులను బుధవారం ఆయన సందర్శించారు. యంత్రాల పనితీరు, బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణ గురించి శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఏవీ రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా 'ముద్ర'

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల శాఖలు 28 వరకు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆయా బ్యాంకులు వ్యక్తిగతంగా గరిష్ఠంగా 12 శాతం మేర మాత్రమే రుణాలు మంజూరు చేశాయి. దీనికి 'సిబిల్' స్కోర్ ప్రధాన సమస్యగా మారినట్లు తెలుస్తోంది. గతంలో బ్యాంకుల్లో రుణాలు పొందిన వ్యాపారులు సకాలంలో నెలవారీ వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో చాలామంది వ్యాపారుల సిబిల్ స్కోరు పడిపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా వ్యాపారులకు తిరిగి రుణాలు మంజూరు చేసేందుకు కొన్ని బ్యాంకులు కొంతమేర వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.

రుణాల మంజూరులో టీజీబీ ముందంజ...

ముద్ర యోజన పథకం కింద వివిధ రంగాలకు చెందిన వ్యాపారులకు రుణాలు మంజూరు చేయడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) ముందంజలో ఉంది. రుణాల విషయంలో వ్యాపారులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న ఏకైక బ్యాంకుగా టీజీబీ పేరు ప్రఖ్యాతులను సొంతం చేసుకుంది. టీజీబీ బ్యాంకుకు బ్రాంచి కార్యాలయాలు అధికంగా ఉండటంతో ఎక్కడికక్కడే వ్యాపారులకు సేవలు అందుబాటులో ఉంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరం జిల్లాలోని అన్ని బ్యాంకుల శాఖలతో పోల్చితే టీజీబీ 32.67 శాతం రుణాల మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా 5,122 మంది వ్యాపారులకు రూ. 88.25 కోట్ల రుణాలు మంజూరు చేసిన టీజీబీ అగ్రస్థానంలో నిలిచింది.

అవగాహనలేమి కూడా కారణం...

చిరు వ్యాపారులకు సకాలంలో సులువుగా రుణాలు అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ముద్ర యోజనపై సరైన అవగాహనలేక వ్యాపారుల నుంచి ఆశించినమేర స్పందన రావడంలేదని తెలుస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పథకాలపై ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండటంలేదని తెలుస్తోంది. చిరువ్యాపారులను ఆదుకొనే ముద్ర యోజనపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజన కారిగా మారే అవకాశం ఉంది.

రహదారికి మరమ్మతు చేయించిన ఎస్సై

భీమిని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని పెద్దపేట రాజారం గ్రామాల మధ్యలో దెబ్బతిన్న రోడ్డుకు ఎస్సై విజయ్‌కుమార్ బుధవారం తాత్కాలికంగా మరమ్మతు చేపట్టారు. రహదారి మధ్యలో లోతైన రంధ్రం పడటం తో ఆయన స్పందించి ట్రాక్టర్‌తో ఇసుక, మట్టితో పూడ్చివేశారు.



మరమ్మత్తులు చేస్తున్న ఎస్సై విజయ్ కుమార్, స్థానికులు

జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్లకు సన్మానం

మంచిర్యాలక్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకున్న జిల్లా అధ్యక్షులు అప్పాసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్‌లను శాలువాలతో సన్మానించారు. నాయకులు నూకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి, మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మాజీ కౌన్సిలర్లు సదానందం, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు పంపిణీ

లక్షెట్టిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమల గ్రామానికి చెందిన పూసం లచ్చయ్య అనే పాడి రైతుకు మంజూరు చెక్కును బుధవారం అటవీశాఖ కార్యాలయంలో సిబ్బంది అందజేశారు. రైతు లచ్చయ్యకు చెందిన లేగదూడ రెండు రోజుల క్రితం అడవికి మేతకు వెల్లగా చిరుతపులి దాడిలో మృతిచెందింది. 12వేల రూపాయల పరిహారం మంజూరు కావడంతో లబ్ధిదారునికి అందించారు. కార్యక్రమంలో ఇచ్‌చార్జి ఎఫ్ఆర్‌వో అనిత, సెక్షన్ ఆఫీసర్ అల్తఫ్ హుస్సేన్, ఎఫ్‌బీవోలు చంద్రశేఖర్, రాజశేఖర్, అత్తె సత్తయ్య, సహకార సంఘం మాజీ చైర్మన్ ఎల్తపు సుధాకర్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

- అదనపు కలెక్టర్ పి చంద్రయ్య

హాజీపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించిన రెండు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని అదనపు కలెక్టర్ పి చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్‌లో గల శ్రీసాయిమణికంఠ ట్రేడర్స్ గత యాసంగి 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి 4108 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం నిల్వలు లేకపోవడంతో మిల్లు యజమానులు గంప శ్రావణ్‌కుమార్, కేతిరెడ్డి అనిల్‌రెడ్డిపై హాజీపూర్ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. విక్రయించిన ధాన్యం విలువ జరిమానాతో కలిపి రూ. 14.86 కోట్లు ఉంటుందని తెలిపారు. శ్రీరాజరాజేశ్వర ట్రేడర్స్‌లో 2022-23, 2023-24తో పాటు వానాకాలాం 2024-25 సంవత్సరానికి సంబంధించి 8,578 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం వినియోగంలో లేకపోవడంతో యజమానులు గంగ సంతోష్ కుమార్, కేతిరెడ్డి మల్లారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. విక్రయించిన ధాన్యం విలువ రూ.30.57కోట్లు ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ధాన్యంను పక్కదారి పట్టించిన 15రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని వివరించారు.



విధులకు డుమ్మా

- గ్రామాలకు వెళ్లకుండానే డీఎస్ఆర్‌లో హాజరు నమోదు
- పంచాయతీ కార్యదర్శుల హాజరు అక్రమాలపై విచారణ
- జిల్లా వ్యాప్తంగా 21 మందికి నోటీసులు

బెల్లంపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతలు మరిచి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాల్సిన కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతూ డీఎస్ఆర్(డెయిలీ షానిటేషన్ రిపోర్ట్) మొబైల్ యాప్‌లో తప్పుడు హాజరు నమోదు చేస్తూ పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సి ఉండగా వారు కూడా పట్టించుకోక పోవడంతో పల్లెపాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

ఇటీవల జగిత్యాల జిల్లాలో ఓ కార్యదర్శి మొబైల్ యాప్‌లో విధులకు హాజరు కాకుండా కార్యదర్శి ఫొటోకు బదులు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫేక్ అటెండెన్స్ వేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఇందులో భాగం గా జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల హాజరు పై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా కార్య దర్శుల హాజరుపై విచారణ చేపట్టారు.

21 మంది కార్యదర్శులకు నోటీసులు...

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకాకుండా ఫేక్ అటెండెన్స్ హాజరు వేసుకున్నందుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 21 మంది కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్‌తో వేసుకున్నట్లు రుజువు కావడంతో వీరందరికి జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని బెల్లంపల్లిలో ఒకరు, కాసిపేటలో ఇద్దరు, కన్నెపల్లిలో ఇద్దరు, భీమినిలో నలుగురు, వేమనపల్లిలో నలుగురు, కోటపల్లిలో ఐదుగురు, భీమారం, జైపూర్, దండేపల్లిలో ఒక్కో కార్యదర్శులు కాగా మొత్తం 21 మంది కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. ఇలా ఎప్పటి నుంచో విధులకు డుమ్మా కొడుతూ వేల జీతం అర్జిస్తున్న కార్యదర్శులపై ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ ఎందుకు పర్యవేక్షించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీవోతో పాటు ఎంపీడీవో, డివిజన్‌లో డీఎల్‌పీవో, జిల్లాలో పంచాయతీ అధికారులు విధులు నిర్వహిస్తారు. కార్యదర్శుల విధి విధానాలను ప్రతీ రోజు పర్యవేక్షించాల్సిన ఎంపీవోలు, ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే కార్యదర్శులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైన కార్యదర్శులపైనే కాకుండా కార్యదర్శుల విధులను పర్యవేక్షించాల్సిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు పంచాయతీ అధికారులకే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోకుండా సంబంధిత ఉన్నతాధికారులను కూడా బాధ్యులను చేస్తూ విచారణ చేపట్టి శాఖపర మైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

విధుల్లో ఇష్టారాజ్యం..

జిల్లాలో మొత్తం 18 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 311 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 10 గంటలలోపు గ్రామానికి వెళ్లి డీఎస్ఆర్(డెయిలీ షానిటేషన్ రిపోర్ట్) ముఖ గుర్తింపు యాప్ ద్వారా సెల్ఫీ ఫొటో దిగి హాజరు నమోదు చేసుకోవాలి. అనంతరం పారిశుధ్య పనుల ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలి. అయితే కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు వెళ్లకుండానే తన మొబైల్‌లో ఫొటోలు దిగి దానిని వాట్సాప్ ద్వారా వారు విధులు నిర్వహించే గ్రామ పంచాయతీ సిబ్బందికి పంపి ఓటీపీ చెబుతూ రోజువారీ హాజరు నమోదు చేసుకుంటున్నారు మరి కొందరు పంచాయతీ కార్యదర్శులు ఏకంగా పంచాయతీ కార్మికుల ఫోన్లలోనే యాప్ ఇన్‌స్టాల్ చేసి కార్మికుల డీఎస్ఆర్ యాప్‌లో కార్యదర్శి హాజ రు చేసుకుంటున్నారు. ఈయాప్‌లలో కొందరు పాత ఫొటోలతో పాటు సంబంధం లేని ఇతర ఫొటోలను సైతం అప్‌లోడ్ చేస్తూ హాజరు వేసుకున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి



పంచాయతీ కార్యదర్శులు తప్పుడు హాజరు నమోదు చేస్తే చర్యలు తప్పవు. కార్యదర్శుల విధుల నిర్వ హణ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టాం. 21 మంది కార్యదర్శులకు నోటీసులు జారీ చేశాం. వారి వివరణ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటాం. కార్యదర్శులపై పర్యవేక్షణ పెంచుతాం.

అంతర్జాతీయ ఇన్సూరెన్స్ సదస్సుకు జిల్లా వాసి



ధర్మేందర్‌ను అభినందిస్తున్న అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ రంగంలో అత్యు త్తమ సేవలందించినందుకు గాను ఈ నెల 14న వియత్నాంలో జరిగే అంతర్జాతీయ ఇన్సూరెన్స్ సదస్సుకు మంచిర్యాల ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ బ్రాంచ్ నుంచి బోడ ధర్మేందర్ ఎంపికయ్యాడు. ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అత్యుత్తమ ప్రతిభ వియత్నాం సదస్సు కు ఎంపికయ్యాడు. బుధవారం మంచిర్యాల లో ధర్మేందర్‌ను బ్రాంచ్ మేనేజర్ యాదగిరి రెడ్డి ఘనంగా సన్మానించారు.

బాలింత మృతి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలోని మాతా శిశు ఆసుపత్రిలో మంగళవారం రాత్రి బాలింత సోని మృతి చెందింది. పట్టణంలోని వినాయకనగర్‌కు చెందిన సోనిని రెండవ కాన్పు కోసం నస్పూర్‌లోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి మంచిర్యాలలోని మాతా శిశు ఆసుపత్రికి తరలించినట్లు భర్త వెంకటేష్ తెలిపాడు. కాగా సోనికి వైద్యులు ఆపరేషన్ చేయగా బాబుకు జన్మనిచ్చింది. అనంతరం తీవ్రరక్తస్రావం కాగా వైద్యులు చికిత్సఅందించినప్పటికీ సోని మృతి చెందింది.

సూపరింటెండెంట్ హరిశ్చంద్రప్రసాద్‌ను వివరణ కోరగా వైద్యులు ఎక్కడా కూడా నిర్లక్ష్యం వహించలేదని అన్ని విధాలుగా ప్రాణాలను కాపాడడానికి ప్రయత్నించినట్లు తెలిపారు.

విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

భీమారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం భీమారంలోని కేజీబీవీ పాఠశాలలో వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీవో పరిశీలించి విద్యార్థినులకు తగు సూచనలు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా 20 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శత్రునాయక్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మి, వ్యవసాయాధికారి సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ వేణు, సిబ్బంది రజిత, మమత, జ్యోతి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో మధుసూదన్

కాసిపేట తహసీల్దార్ బదిలీ

కాసిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాసిపేట తహసీల్దార్ భోజన్న బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లనున్నారు. ఏడాదిలోపు సర్వీసు ఉన్న నేపథ్యంలో అకస్మాత్తుగా బదిలీ అయ్యారు. సీసీఎల్ హైదరాబాద్ నుంచి బుధవారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించారు.

సంక్షిప్తంగా..

తాండూర్: తాండూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పాలసీ తీసుకున్న ఉట్నూరి రోజా కొన్ని రోజుల క్రితం మృతి చెందగా నామినీ ఉట్నూరి ఆశాలుకు రూ. రెండు లక్షల బీమా చెక్కును బ్యాంకు మేనేజర్ ఇందాల్ గుగులోత్ అందజేశారు.

నెన్నెల: అక్రమ పట్టాలు చేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ జ్యోతిపై ఒత్తిడి తేవడం వల్లే గుండె పోటుతో మృతి చెందారని మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ ఇబ్రాహీం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ జ్యోతికి నివాళులు అర్పించారు.

హాజీపూర్: వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ స్వరూప్‌రాజ్, కళాశాల కరస్పాండెంట్ పెట్టెం మల్లయ్య పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మందమర్రిలో నేడు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలందరు తరలి రావాలని బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేష్, పట్టణాధ్యక్షుడు జె. రవీందర్, నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్‌లు పేర్కొన్నారు.

దండేపల్లి: ఈనెల 9వ తేదీన జరిగే ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

- దండేపల్లి మండలంలోని గూడెం సత్యానారాయణస్వామి ఆలయంలో పవిత్రోత్సవ ప్రత్యేక పూజలను ప్రధాన ఆలయంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు సామూహిక వ్రతాలను ఆచరించారు.
- దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి రవి అనే విద్యార్థి వ్యవసాయ శాఖ కీటక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందాడు. స్థానిక భారతీ విద్యా నికేతన్‌లో ఐదో తరగతి వరకు చదివిన ఆయన ఇంటర్మీడియట్ వరకు ముథోల్ గురుకులంలో విద్యను అభ్యసించారు. అనంతరం బీఎస్సీ అగ్రికల్చర్ ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో, పీజీ ఒడిషా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీలో పూర్తి చేశారు. అక్కడే ప్రత్యేక టాపిక్‌పై ప్రతిభ కనబర్చి పీహెచ్‌డీ పట్టా పొందాడు.

మంచిర్యాల కలెక్టరేట్: నిరుపేదలకు భరోసాగా గాయత్రి బ్యాంకు సేవలు ఉంటాయని మంచిర్యాల శాఖ మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బ్యాంకు ఆవరణలో లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును రజితకు అందజేశారు.

'ఆధార్' హాజరు నుంచి మినహాయించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్‌లతో పాటు పర్యవేక్షణ సిబ్బందికి ఆధార ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా పారామెడికల్ ఐక్యవేదిక నాయకులు బుధవారం ఆరోగ్య జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ ప్రతీ రోజు ఆరోగ్య కేంద్రాల పరిధిలో పర్యటించే పారామెడికల్ సిబ్బందికి అబాస్ పద్ధతిలో హాజరువేయాలనడం సరైంది కాదన్నారు. ఫీల్డ్‌కు వెళ్లే ఏఎన్ఎంలు, పర్యవేక్షణ సిబ్బందికి ఈ హాజరు కష్టంగా ఉంటుందని, దీని నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక చైర్మన్ జగదీష్, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్ అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, బీజేపీ నాయకులు రమేష్, పద్మ, వసుమతి, దమోదార్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో బుధవారం పత్తిలో కాండం పూతపై రైతులకు ఏఈవో ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంట విత్తిన 25 రోజుల నుంచి ప్రతి 25 రోజులకు పంటపై ఆశించే రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంకల పురుగుల మందుల పిచికారీ చేయడానికి రైతులు పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి వస్తుందన్నారు. వీటి నివారణకు తక్కువ పురుగు మందులు, తక్కువ మంది కూలీలతో కాండం పూత పద్ధతి అనుకూలంగా ఉంటుందన్నారు. మోనోక్రోటోపాస్, ఇమిడాక్లోప్రైడ్, ఫ్లనికామిడ్‌వంటి మందులను తక్కువ మోతాదులో వినియోగించి చీడ పీడలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని, ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఐఎం పార్టీ నాయకులు బుధవారం స్థానిక జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ గనుల్లో ఉత్పత్తి, ఉత్పాదకత కోసం పోటీలు నిర్వహించి లక్ష్యాలను సాధించేలా ఉద్యోగులను ప్రేరేపిస్తున్నారని, కానీ రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు ప్రదేశాలను పరిశీలించిన తర్వాతను కార్మికులను విధులకు పంపాలని సూచించారు. అనంతరం పీఎం శ్యాంసుందర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, చందు, శ్రీనివాస్, అశోక్, ఉమారాణి, మహేందర్, సమ్మక్క, రమాదేవి, నిర్మల, రాజేశం, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు







ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న 13వ బెటాలియన్ పోలీసులు, చెన్నూరులో బీఆర్ఎస్ నాయకులు, కాసిపేటలో నివాళులు అర్పిస్తున్న అధికారులు, స్థానిక నాయకులు

తెలంగాణ తొలి, మలి ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఏర్పాటులో జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు.

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయంలో జరిగిన వేడుకల్లో అని బీజేపీ జిల్లా నాయకుడు తుల మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో జయశంకర్ స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

హాజీపూర్: మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో జరిగిన వేడుకల్లో కమాండెంట్ వెంకట రాములు, అసిస్టెంట్ కమాండెంట్లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, పోలీసు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: అఖిలభారత విశ్వకర్మ మహాసభల సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ల వెంకటేష్, దండేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బండి రవి, గౌరవ సలహాదారు మోదంపురం వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, ప్రధానకార్యదర్శి ఇనుగుర్తి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ పట్టణ యూత్ ప్రెసిడెంట్ సబ్బని అరుణ్, నాయకులు అలీభాయ్, కాంపెల్లి రాజం, సుందర్, మద్దెల గోపి పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, శంకర్, అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరులోని మున్సిపల్ కార్యాలయంలో మాజీ సర్పంచు సాధనబోయిన కృష్ణ, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, నాయకులు మల్లికార్జున్ యాదవ్, మల్లేష్, రాజశేఖర్, ప్రశాంత్, మనోహర్, గోపి, వెంకన్న, సంపత్, బాపు, శివతేజ పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ వనజా రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ తిరుపతి, సర్వేయర్ రాయలింగు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: భీమారంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మండల పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డి, నాయకులు అశోక్, రాజేష్, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో ఎంపీడీవో గంగామోహన్, సీనియర్ అసిస్టెంట్ గోపతి రవీందర్, ఏపీవో సత్యప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయం, తాటిగూడెం లో జరిగిన వేడుకల్లో ఎంపీవో సప్దర్ అలీ, లక్ష్మీనారాయణ, ముత్యాల నగేశ్, మడావి వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరులోని ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో మోహన్, ఈజీఎస్ ఏపీవో గంగాభవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంగీత, ఉపాధ్యాయులు చందు, సత్యేంద్ర, కుమార్, శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, వయోజన విద్యాశాఖ కార్యాలయంలో బీసీ అభివృద్ధి అధికారి పురుషోత్తం, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ పోరాటాలు చిరస్మరణీయం

మందమర్రిటౌన్: స్వరాష్ట్ర సాధన కోసం దివంగత ప్రొఫెసర్ జయశంకర్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం ఢిల్లీలో జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఎన్నో పుస్తకాలను రాసి ప్రజలను చైతన్యవంతం చేశారని తెలిపారు. ప్రాణాలు పోయేంత వరకు తెలంగాణ ప్రత్యే రాష్ట్రం కోసం పోరాడిన గొప్ప నాయకుడని కొనయాడారు.

గుండెపోటుతో తహసీల్దార్ మృతి

నెన్నెల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నెన్నెల తహసీల్దార్ ముదమల్ల జ్యోతి ప్రియదర్శిని (50) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె స్వస్థలం జగిత్యాల కాగా ఒంటరిగా సీసీసీ నస్పూర్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం నెన్నెలలో విధులు ముగించుకొని సీసీసీలోని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి తనకు చాతిలో నొప్పి వస్తోందని ఆసుపత్రికి వెళ్లేందుకు వెంటనే ఇంటికి రావాలని తన కారు డ్రైవర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. డ్రైవర్ ఇంటికి వచ్చి చూసేసరికి అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నారు. పొరుగువారి సహకారంతో ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. కోటపల్లి, చెన్నూరు మండలాల్లో తహసీల్దార్‌గా, బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా సేవలదించిన జ్యోతి ప్రియదర్శిని గత నెల 9న బదిలీపై నెన్నెలకు వచ్చారు. అనతి కాలంలోనే ప్రజలు, అధికారుల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చేసి పెట్టాలని సూచించారు. ఆమె మాట్లాడిన ఆఖరు మాటలను సిబ్బంది మననం చేసుకున్నారు. ప్రజాసేవ కోసం తమ తహసీల్దార్ తపించేవారని సిబ్బంది పేర్కొన్నారు. అధికారులు, నాయకులు ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. జగిత్యాలలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



ముదమల్ల జ్యోతి (ఫైల్)

● తహసీల్దార్ మృతికి నివాళి

మంచిర్యాల కలెక్టరేట్: నెన్నెల తహసీల్దార్ జ్యోతి మృతికి బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తహసీల్దార్ జ్యోతి భౌతికకాయానికి బీఆర్ఎస్ నాయకులు నివాలులర్పించారు. పడాల రవి, తిరుపతి, సుబ్బన్న, కుమార్, రాజు పాల్గొన్నారు.
- **మందమర్రిరూరల్:** మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, సిబ్బంది సంతాపం తెలిపారు. ఆర్ఐ గణపతి, ఆపరేటర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులను చెల్లించాలి

చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌టీఎల్ఐ సంపాదిత సెలవుల వంటి అన్నిరకాల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వఅభియాన్‌లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను బుధవారం సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వనమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు దాచుకున్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ నిధులను పిల్లల ఉన్నత చదువులకు, పెళ్లిళ్ల ఖర్చులకు రుణాలకోసం దరఖాస్తు చేసి రెండేళ్లు దాటినా ఇంకా ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే



ఢిల్లీలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్

● మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేంద్రం తప్పకుండా అమలు చేయాల్సిందేనని కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రాష్ట్ర ప్రభుత్వం కుల గణనలో ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అమలు చేయాలని తెలిపారు. ఈ ధర్నాకు చెన్నూర్, రామకృష్ణాపూర్ నుంచి బీసీలు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

కాంగ్రెస్ మహా ధర్నాలో ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన మహాధర్నాలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్ పాల్గొన్నారు. బీసీలకు మద్దతుగా వారి హక్కుల సాధన కోసం ధర్నాలో పాల్గొని మద్దతు ప్రకటించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా 'ముద్ర'

- రుణాలు అందించడంలో బ్యాంకర్ల సేవలు భేష్
- జిల్లావ్యాప్తంగా రుణాల మంజూరులో టీజీబీ ముందంజ
- 32 శాతం రుణాలతో వ్యాపారుల పక్షపాతిగా పేరు
- ఆర్థిక స్వావలంబన దిశగా వ్యాపారులు





మంచిర్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):

చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చి వారి ఆర్థిక ప్రగతికి ఉపకరించే కేంద్రప్రభుత్వ పథకం 'ప్రధానమంత్రి ముద్ర యోజన' బ్యాంకర్ల సహాయ సహకారాలతో ప్రజల మన్ననలు పొందుతోంది. జిల్లాలోని అన్ని బ్యాంకులు ముందుకు వచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేస్తే వ్యాపారుల ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పాటు అందేది. కొన్ని బ్యాంకులు మొక్కుబడిగా రుణాలు మంజూరు చేస్తుండటంతో ప్రభుత్వ పథకం లక్ష్యం జిల్లాలో సంపూర్ణం కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కుకొని బతుకులు బుగ్గిపాలు చేసుకుంటున్న చిరువ్యాపారులకు ఆర్థికంగా తోడ్పాడుటునందించే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ముద్ర యోజన' పథకాన్ని ప్రారంభించింది. సేవారంగం, ఉత్పత్తి రంగాలకు చెందిన వ్యాపారస్థులకు అవసరమైన రుణాలు అందించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా చిరు వ్యాపారులు సమీపంలోని బ్యాంకుల్లోనే ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటు కల్పించింది. అయితే జిల్లాలో మాత్రం ఈ పథకం ఆశించిన స్థాయిలో లక్ష్యం చేరడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పలువురు బ్యాంకర్లు అర్హులైన వ్యాపారులకు రుణాలు పంపిణీ చేయడంలో అనవసరమైన మెలికలు పెడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మూడు విభాగాల్లో రుణాలు మంజూరు..

ముద్ర యోజన కింద శిశు, కిషోర్, తరుణ్ విభాగాల్లో రైతులకు రుణాలు అందించాల్సి ఉంది. వీటిలో శిశు పథకం కింద 50వేల రూపాయలు, కిషోర్ పథకంలో ఐదు లక్షల రూపాయలు, తరుణ్‌లో భాగంగా పదిలక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేస్తారు. ఆయా విభాగాల్లో అర్హతగల వ్యాపారులు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. అయితే కొన్నిచోట్ల బ్యాంకర్లు నిర్ణయించిన మేరకు పూర్తిస్థాయిలో రుణం మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. శిశు పథకం కింద రూ. 50వేలు రుణం ఇవ్వాల్సి ఉండగా కొన్ని బ్యాంకులు మాత్రం రూ. 25వేల నుంచి 30వేల వరకే ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కిషోర్, తరుణ్ పథకాల్లోనూ అదే పద్ధతి అవలంబిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో అన్ని రకాల..

(మిగతా 7లో..)

వ్యాపారులకు వివిధ బ్యాంకులు మంజూరు చేసిన రుణాలు

బ్యాంకు	వ్యాపారులు	రుణం(కోట్లలో)
టీజీబీ	5,122	88.25
బంధన్	11,667	67.09
ఎస్‌బీఐ	2170	33.04
యాక్సిస్	3431	19.1
యూబీఐ	672	18.06
ఇండస్ ఇండ్	949	13.84
ఐడీఎఫ్‌సీ ఫస్ట్	371	10.69
హెచ్‌డీఎఫ్‌సీ	131	8.11

భారీ వాహనాలకు అనుమతులివ్వాలి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఖలీందర్‌ఖాన్

జన్నారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖలీందర్‌ఖాన్ అన్నారు. 23 రోజులుగా మండల కేంద్రంలో కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరహార దీక్షకు మద్దతుగా బుధవారం సీపీఎం పార్టీ నాయకులు దీక్షలో కూర్చొని మద్దతు పలి కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీవాహనాలను అనుమతించకపోవడంతో ఆంక్షలు విధించడం వల్ల వివిధవృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులకు పనిదొరకక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. జన్నారం, కడెం మండలాలు పూర్తిగా వ్యవసాయ మండలాలని దీనికి భారీవాహనాలు అడ్డంకి ఉండడం వల్ల విత్తనాలు, ఎరువులతో పాటు పనిముట్ల ధరలు అధికమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఆంక్షలు ఎత్తివేసి భారీ వాహనాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త భూమాచారి, సీపీఐ నాయకులు దాసరి తిరుపతి, దేవి పోచన్న, మామిడి విజయ్ పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించాలి

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. శ్రీరాంపూర్ సర్కిల్ పరిధిలోని విద్యాసంస్థల డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ నియమాలు, విద్యార్థుల రక్షణపై శ్రీరాంపూర్ వీటీసీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా, ఏసీపీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలకు విద్యార్థులను తీసుకెళ్లేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైవర్లు తమ వాహనాలను హైవేలపై రోడ్డుకు ఇరుపక్కలా ఎక్కువసేపు నిలిపి ఉంచవద్దన్నారు. ప్రతి స్కూల్ బస్‌కు ఒక హెల్పర్ ఉండాలని, పిల్లలను తీసుకెళ్తున్న సమయంలో ఎక్కువ స్పీడ్‌తో వెళ్ల వద్దని, సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. ఆలస్యం అవుతోందని వేగంగా వాహనాన్ని నడుపవద్దని, వాహనం కండీషన్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ మాట్లాడుతూ, డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నియమాల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని, వాహనపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్‌ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్న, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లు, యజమానులు, ఆటో, టాటా ఏస్, బస్, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

లక్సెట్టిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని, జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. బుధవారం లక్సెట్టిపేట మండలంలోని చందారం, దౌడేపల్లి, వెంకట్రావుపేట, కొత్తూర్ గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నర్సరీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో మొక్కలను నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మండలంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇంటి నిర్మాణం పనులు వేగంగా పూర్తి అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, ఎంపీడీవో సరోజ, ఈజీఎస్ ఏపీవో వేణుగోపాల్ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రి పరిశీలన..

లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వం ఇటీవల నూతనంగా నిర్మాణం చేసి ప్రారంభించిన 30పడకల ఆసుపత్రిని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని పలువార్డులను తిరుగుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరం అయ్యే మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు కృష్ణ, సురేష్, పవిత్ర, స్రవంతిరావు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.



లక్సెట్టిపేటలో ప్రభుత్వాసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తిచేయాలి

మంచిర్యాల కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీఎస్ఆర్ నిధుల కింద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల కింద సింగరేణికి సంబంధించి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. మురుగు కాలువలు, రహదారులు, చెరువు పూడికలు, వీదిదీపాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి సకాలంలో బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణచందర్‌రావు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై పీహెచ్‌సీ డాక్టర్లపై ఫిర్యాదు

నస్పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత దూలం సోని (25) మృతి చెందిందని భర్త దూలం వెంకటేశ్ బుధవారం నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందిన మేరకు కేసు నమోదు చేసినట్లు నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. లోబీపీతో పాటు, రక్తస్రావం ఎక్కువ అవుతుందని చెప్పి మాతాశిశు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో చనిపోయిందన్నారు. సోని నస్పూర్ పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యు. ఉపేందర్ రావు తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై యూఎస్ఎఫ్ఐ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నస్పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కా రించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట భారత ఐక్య విద్యార్థి సంఘం (యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకు ముందు జాతీయ రహదారి కమాన్‌వద్ద నుంచి ఊరేగింపుగా కార్యాలయ ప్రధానద్వారం వరకు చేరుకుని ఆందోళనకు దిగారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యకు అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్ మెంట్స్ విడుదలలో నిర్లక్ష్యం చేస్తోం దన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పర్మిషన్ లేకుండా పుట్టగొడుగుల్లా వెలిసిన హాస్టల్స్‌ను మూసివేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు మణిచరణ్, రెహమాన్, దినేష్, ఆకాష్, వెంకటేష్, అనిల్, సిద్దార్థ, సంజయ్, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత జయశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రజా చైతన్యానికి కృషి చేసిన తెలంగాణ స్ఫూర్తిప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరలో నిర్వహించిన జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో తన వంతు పాత్ర పోషించి ప్రజా చైతన్యానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఐటీయూ నాయకుల అరెస్టు



హాజీపూర్ పోలీసు స్టేషన్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు

తాండూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైద్రాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అరెస్టుచేసి మాదారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న బోజన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వేతనాలు, బిల్లులురాక అప్పుల పాలవుతున్నారన్నారు. వెంటనే వేతనాలు, బిల్లులు చెల్లించాలని, కోడిగుడ్లను ఉచితంగా అందించాలని, నెలకు రూ. 10 వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మీ, సరిత, జహీరబేగం, శాంత, అనీషా, శ్రీలత పాల్గొన్నారు.

హాజీపూర్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్తున్న మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఫైనాన్స్ విభాగం ఉద్యోగుల అన్నదానం

శ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని శ్రీసాయి అనాథలు, వృద్ధుల ఆశ్రమంలో జీఎం కార్యాలయంలో పనిచేసే ఫైనాన్స్ విభాగం ఉద్యోగులు బుధవారం అన్నదానం చేశారు. ఫైనాన్స్ మేనేజర్ జి నరేష్ ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు ఆశ్రమంలోని వృద్ధులు, అనాథలతో భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ వారికి ఎలాంటి సహాయసహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఫైనాన్స్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పోరాట గొంతుక గద్దర్



మంచిర్యాలలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక కళాకారులు

బెల్లంపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌకగద్దర్ పీడిత ప్రజల పోరాటగొంతుకగా నిలిచారని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి మాట్లాడారు. తెలుగు ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో గద్దర్‌ది అద్వితీయ పాత్ర అని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను పాటగా మలిచి పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన ప్రజా గాయకుడు గద్దర్ అని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దోపిడీ, మతోన్మాదం, అంటరానితనం, ప్రజా వ్యతిరేక విధానాలపై వేలాది పాటలు రాసి ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. ఆయన ఎంచుకున్న సిద్ధాంతం కోసం జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు నీరటి రాజన్న, ఐఎఫ్‌టీయు నాయకులు ఎండీ చాంద్‌పాషా, టీఎస్‌టీయూసీ నాయకులు మణిరాంసింగ్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బుధవారం ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కళాకారులు నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులు కొప్పర్తి సురేందర్, కొప్పర్తి రవీందర్, ములకల మురళి, రమేష్, కుమ్మరి శ్రావణ్‌కుమార్, గొడిసెల కృష్ణ, పోశన్న, శ్రీనివాస్, నాగలక్ష్మీ, శిరీష, సంధ్య, నిరోషా, సల్లూరి కృష్ణ, సత్యం పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గద్దర్ వర్ధంతిని విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, మాదిగ స్టూడెంట్ ఫోరం నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, వడ్లకొండ సంజయ్, ప్రవీణ్, అనురాగ్, విజయ్, పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



6

బెల్లంపల్లిలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, నాయకులు